క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు పావులూరి రాంబాబు పేర్కొన్నారు. క్లబ్ ప్రతినిధి కృష్ణ చైతన్య ఆర్థిక సహకారంతో ఆటోనగర్ సమీపంలో బుధవారం సుమారు 50వేల విలువ చేసే మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సైతం పట్టణంలో మరిన్ని మొక్కలు నాటుతామని చెప్పారు. క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీ కృష్ణ, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి కేఎల్ జగదీశ్వరాంబ, డాక్టర్ జీవనలత, జీవీ నారాయణ, జి.వెంకటరత్నం, కొఠారి రమేష్ కుమార్ జైన్, నరేష్ కుమార్ జైన్, ఈదర శ్రీనివాసరావు, కె.ఉపేంద్ర, శంకరయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: కీసరి లక్ష్మారెడ్డి, కీసరి పెద్ద కాశమ్మ, పి.సుబ్బారెడ్డి, పి.లక్ష్మీసామ్రాజ్యంల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకుడు కీసరి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో బుధవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కీసరి కార్తీక్ రెడ్డి, పాతూరి వెంకటేశ్వరరెడ్డి, గాయం ఆంజనేయులు, సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం గుర్తించారు. లారీ యజమానికి రూ. 10 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు సాలిపేటలో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను గురువారం సాలిపేట టెలిఫోన్ ఎక్చైంజ్ రోడ్డులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 20వ వార్డు సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు. ఈఅవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

దోమల నివారణకు చర్యలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా బుధవారం నులకపేటలోని మసీదు సెంటర్, క్వారీ గుంతలు, మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లారు. వర్షపునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ ఏర్పాటు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైక్ ద్వారా ప్రచారం చేస్తూ మరోపక్క ఫాగింగ్ చేపట్టారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు ఆహ్వానం



తాడేపల్లిరూరల్: వీరమరణం పొందిన పోలీసు కుటుంబాన్ని పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు రావాలని కోరుతూ కాకినాడ మూడో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జేఎస్వీ సత్యనారాయణ ఆహ్వానం పలికారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లికి చెందిన వి.శంకరరావు, కాకినాడ మూడో బెటాలియన్‌లో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో ఉండగా 1992లో నక్సలైట్లు పేల్చిన బాంబుదాడిలో శంకరరావు ప్రాణాలు కోల్పోయాడు. ఈనెల 21వ తేదీన పోలీసు అమరవీరుల దినోత్సవం నేపథ్యంలో కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు బుధవారం బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సత్యనారాయణ తాడేపల్లి చేరుకుని వీరమరణం పొందిన శంకరరావు భార్యకు పండ్లు, పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు.

మెరుగైన ఆరోగ్యానికి చిరునామా

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో మంచి వైద్యం, నాణ్యమైన మందులు ఇస్తున్నారన్న సంతృప్తిలో ప్రజలు
- ఇంత గొప్ప కార్యక్రమంలో భాగస్వామి అయినందుకు గర్విస్తున్నా
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు చిరునామాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ 16వ వార్డులో గల పద్మశాలిపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బుధవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించారు. వైద్యాధికారులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శిబిరానికి వచ్చిన స్థానిక ప్రజలను పలకరించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45 రోజులపాటు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు గత 35 రోజులుగా సందడిగా కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ఆరోగ్య సమస్యలున్న ప్రతిఒక్కరూ తమ సచివాలయం పరిధిలో ఏర్పాటుచేస్తున్న వైద్యశిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్యచికిత్సలు చేయించుకుంటున్నారని తెలిపారు. వీరికి అవసరమైన మందులు నాణ్యమైనవి ఇస్తున్నట్టు చెప్పారు. అందుతున్న వైద్యసేవలపై రోగులు సంతృప్తిని వ్యక్తం చేస్తుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. శాసనసభ్యుడిగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఎన్ని చేస్తున్నా, ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసం చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు తృప్తిగా ఉందన్నారు. వైద్యులు చక్కగా సేవలందిస్తున్నారని, మంచి మందులు ఇస్తున్నారని ప్రజలు చెబుతున్నారని, ఎమ్మెల్యేగా ఇలాంటి గొప్పసేవలో పాల్గొంటున్నందుకు గర్వపడుతున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ఎంతో శ్రమిస్తూ, భారీగా ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సహా అంతా టీం వర్క్‌గా పనిచేస్తుందనే ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కార్యాలయం, జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలన్న సంకల్పంతోనే అందరూ శ్రమిస్తున్నారని చెబుతూ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కడైనా రోగులు మిగిలిపోతే అదేచోట మరోరోజు శిబిరం కొనసాగిస్తామని కూడా చెప్పారు. వీరితో మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ మాలేపాటి హరిప్రసాద్, 16వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కాళిదాసు విజయసత్యం, కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి, బట్టు దుర్గారావు, కురగంటి రవిశంకర్, టి.చంద్రశేఖర్, ఇస్మాయిల్, అలూరి శ్రీను, సతీష్, శ్యామ్ ఉన్నారు.

గుడివాడలో 500 మందికి వైద్యపరీక్షలు..

తెనాలిటౌన్: పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం గుడివాడలోని హెల్త్ క్లినిక్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే శివకుమార్ సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు చేసేందుకు తెనాలి, గుంటూరులోని వైద్యశాలలకు రిఫర్ చేయాలని సూచించారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో సుమారు 500 మంది రోగులకు వైద్యులు దిలీప్, మన్మథకుమార్, సుమంత్, రవికిరణ్‌లు వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ రక్తపరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి సీడీపీఓ ఎం.సునీత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎమ్మెల్యే శివకుమార్ పరిశీలించారు. తినుబండారాలు, పౌష్టికాహారం చూసి పరిశీలించి కార్యకర్తలను అభినందించారు. మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, కోపల్లె సర్పంచ్ చింతల కుమారి రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యులు కారుమంచి కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.సుభాష్ చంద్రబోస్, సచివాలయ కన్వీనర్‌లు కె.పవన్ కుమార్, కడియాల శివరామబ్రహ్మం, బురదగుంట రమేష్, పిల్లి సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



తెనాలి సాలిపేటలో పేర్లు నమోదు చేయించుకుంటున్న రోగులు



బాలుడికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యురాలు



రక్తపరీక్షలు చేయించుకుంటున్న మహిళ

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- వాసవీ ఆలయంలో చండీహోమం
- ఆలయాల్లో భక్తుల విశేష పూజలు

తెనాలిటౌన్: పట్టణ, రూరల్ మండల గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయాల్లో భక్తులు విశేషపూజలు చేశారు. బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆలయకమిటీ సభ్యులు జి.విశ్వేశ్వరరావు దంపతు లు, కుటుంబసభ్యులు చండీహోమం నిర్వహించా రు. ఆలయంలో రాజరాజేశ్వరిదేవికి శ్రీభవానిదేవి అలంకరణ చేశారు. కన్యకాపరమేశ్వరిదేవి శ్రీగాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- మారీసుపేట శివాలయంలో బాలత్రిపురసుందరిదేవికి శ్రీమహాదుర్గాదేవి అలంకరణ చేశారు. దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.
- గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అమ్మవారు హంసగాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాలిగ్రామ మఠం కార్యదర్శి ఎం.రమణయ్య, వుప్పల నాగేశ్వరరావు, లలితసేవా సమితి, శ్రీవిద్యాపీఠం సభ్యులు పాల్గొన్నారు.
- ఐతానగర్‌లో పేరంటాళమ్మ గుడివద్ద మహిళలు బిందెలతో నీళ్లు తీసుకెళ్లి అమ్మవారికి అభిషేకం చేశారు. నవదుర్గలను ఏర్పాటుచేసి పూజలు జరిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రజకపేటలో ఏర్పాటు చేసిన కనకదుర్గ విగ్రహంవద్ద రూ.6 లక్షలతో అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణ చేశారు.
- బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద మహిళలు కుంకుమపూజలు జరిపారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో రూ.లక్షతో అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ చేశారు. భక్తులు పూజలు చేశారు.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో భవానీదేవి అలంకరణలో..



విద్యాపీఠంలో హంసగాయత్రీ దేవిగా..



మారీసుపేట శివాలయంలో మహాదుర్గాదేవిగా..



రాజరాజేశ్వరి ఆలయంలో సంతానలక్ష్మి అలంకరణ



కొలకలూరులో ధైర్యలక్ష్మిగా..



వాసవీ ఆలయంలో గాయత్రీదేవిగా..



వాసవీ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



శ్మశానవాటిక అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు

కొల్లిపర: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. మండల కేంద్రం కొల్లిపరలో రూ. 45లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు నాయకులతో కలసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ రూ. 25 లక్షలు, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నిధుల ద్వారా మరో రూ. 20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలానే కొల్లిపర వంతెన, దావులూరు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు నెర్ల కుటుంబరెడ్డి, అన్నవరపు రమేష్, కల్లం వీరారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, గుడ్‌విల్ కృష్ణరెడ్డి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పిల్లి గంగాధర్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



ఫోన్‌లో మాట్లాడుతున్న డీఎం రాజశేఖర్

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఏడుగురు ప్రయాణికులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. వాటిలో తెనాలి నుంచి బెంగళూరు, మచిలీపట్నం, బాపట్ల, గుంటూరు ఎస్వీఎన్ కాలనీ, పేరేచర్లకు బస్సులు నడపాలని పలువురు కోరారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని డీఎం ఎ రాజశేఖర్ తెలిపారు. అలాగే గుంటూరు రూట్‌లో బస్సులు ఆపటం లేదని, విజయవాడ రూట్‌లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, బస్సులను రోడ్డు మధ్యలో ఆపటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పలువురు ఫిర్యాదులు చేశారు. వెంటనే సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసి, మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని డీఎం హామీ ఇచ్చారు. ఇలా ఏడు సూచనలు వచ్చాయని డీఎం తెలిపారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ శంకర్‌నాయక్



ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పిట్టలవానిపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పేదలు ధీమాగా జీవించవచ్చని డీఆర్‌డీఏ పీడీ శంకర్ నాయక్ అన్నారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఏడాదికి 100 రోజులు ఉపాధి హామీ పథకం కింద కూలి పనులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజూ రూ.270 కూలి నిర్ణయించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆయా గ్రామాల నివేదికలను చదివి వినిపించారు. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల విలువ గల పనులను కూలీలకు కల్పించామని తెలిపారు. గ్రామాలలో సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డీఎల్‌డీఓ చంద్ర సువార్త, ఎంపీడీఓ శేషమాంబ, ఏపీఓ సుభాషిణి, ఈఓపీఆర్డీ పద్మజ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఫీల్డు అసిస్టెంట్‌లు గోవిందరెడ్డి, గోపి, శ్రీనివాసరెడ్డి, శివరావు, కూలీలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు



ఓలేరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడమే కాక ఆరోగ్యవంతమైన రసాయనాలు లేని పంట ఉత్పత్తులను సాధించవచ్చునని ప్రాజెక్ట్ రీసోర్స్‌పర్సన్ శివనాగేశ్వరమ్మ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన మేరుగ వెంకట ప్రసాద్ ఇంటి వద్ద బుధవారం గ్రామ సంఘం ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకులు, అలములుతో అగ్ని అస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు చూపారు. మేరుగ ప్రమీలారాణి, ఐసీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 12న పోలు రాధా ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు: శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి (భట్టిప్రోలు) ఆధ్వర్యంలో మండల స్థాయి పోలు రాధా ఎడ్ల పోటీలు నవంబర్ 12వ తేదీన స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీలోగా పోటీదారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ.15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందించనున్నట్లు తెలిపారు. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహిస్తామని, టైరు బండి తోలుకునే ఎద్దుల వరకు ఈ పోటీలలో అనుమతిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 63006 53089, 96182 06050 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సమగ్ర భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు

నగరం: సమగ్ర భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. మండలంలోని పెద్దవరం గ్రామంలో సమగ్ర భూ రీసర్వే పూర్తికావడంతో హద్దు రాళ్లను రెవెన్యూ సిబ్బంది బుధవారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సమగ్ర భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు చేకూర్చుతాయన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి భూ సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రీసర్వేతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటికలో బెడ్డు ఏర్పాటు

భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ స్మశానవాటిక దహన శాలలో కింది భాగం దెబ్బతినడంతో మృతదేహాలను ఆరుబయట దహనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ 16వ వార్డు సభ్యులు వంగర వీరయ్య ముందుకు వచ్చి తన సొంత ఖర్చులు రూ.35 వేల వ్యయంతో బెడ్డును వేయించారు. ఇందుకు ఇసుక, సిమెంటు, కంకర సమకూర్చారు. వర్షం వస్తే మృతదేహాలను దహనం చేయడం ఇబ్బందిగా మారడంతో తన వంతుసాయంగా బెడ్ వేయించినట్లు వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ వార్డు సభ్యులు వీరయ్యను పలువురు అభినందించారు.

బాలల హక్కులు, రక్షణ యంత్రాంగాలపై శిక్షణ



వేమూరు: మానవ జీవితంలో బాల్యదశ అపూర్వమైనదని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్రంట్ లైన్ గవర్నమెంట్ వర్కర్స్‌కి బాలల హక్కులు, బాలల రక్షణ యంత్రంగాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ బాలల కోసం బాలల రక్షణ యంత్రాంగాలు పని చేస్తున్నాయన్నారు. గ్రామ ఉప సర్పంచ్ తలతోటి ప్రదీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణ, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి, క్లస్టర్ మేనేజరు శ్రీనివాసరావు, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కీర్తన పాల్గొన్నారు.

తెనాలిలో దేవదాయశాఖ సలహాదారు శ్రీకాంత్



శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

తెనాలి: దేవదాయ ధర్మదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ బుధవారం తెనాలి వచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వరపేటలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన వేదసభలో పాల్గొన్నారు. వేదపండితుల స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను సమర్పించారు. దసరా నవరాత్రులు విశేషంగా జరిగే తెనాలిలోని చారిత్రక ఆలయంలో ఉత్సవాల్లో పాల్గొనటం తన అదృష్టంగా జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. వీరితో రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ త్రిపురారిభట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ, బ్రాహ్మణ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ నందివెలుగు రామకృష్ణశర్మ, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

20న గుంటూరులో మాదిగల మహాసదస్సు

కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల నాగేశ్వరరావు, నాయకులు

భట్టిప్రోలు: ఎస్సీ వర్గీకరణ, సంక్షేమం, రాజకీయ వాటాకై ఈ నెల 20న గుంటూరులో నిర్వహిస్తున్న మాదిగల మహా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ నన్నెపాముల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు బౌద్ధస్థూపంలో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మాదిగలు సామాజికంగా, రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ జనాభా ప్రాతిపదికన కులాల వారీగా విభజన చేసి మాదిగలకు రావాల్సిన వాటాను రాబట్టుకునేందుకు జరిగే ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై హక్కులను సాధించుకునేందుకు పోరాటం కొనసాగించుకోవాలని పేర్కొన్నారు. గుంటూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కొల్లూరు సురేష్ బాబు, కోన శ్రీనివాసరావు, రాష్ట్ర కన్వీనర్ యేటుకూరి విజయ్‌కుమార్, జిల్లా నాయకులు కటికల కళాకరరావు, కొమరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

భట్టిప్రోలు: స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరిలు కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విజన్ బిల్డింగ్ కార్యక్రమంపై గ్రామ సంఘాల అధ్యక్షులకు నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు కొలకలూరి రజనీ కుమారి, కొండెపాటి సాంబయ్య, దాసరి హనోకు, అకౌంటెంట్ బత్తుల శిరీష, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.